# పచ్చనోటు

మాధవరావు ఆ కాలేజీలో లెక్చరరు. చాలా తెలివైన వాడని అందటి అభిప్రాయం (అతని అభిప్రాయం కూడా అదే!) ఎమ్. ఎస్ సి. యూనివర్శిటీ ఫస్టున ప్యాసయ్యాడు మరి. అందునా పాత రికార్డులు 'ముక్కా-ముక్కలు' చేసి ఉత్తీర్ణుడయ్యాడు. మరి అలాంటివాడు కాలేజీలో లెక్చరరుగా యెందుకు చేరవలసి వచ్చిందీ అని అడుగుతారేమో? అయ్యా! తమకు తెలియని దేముంది. పాపం, మాధవరావు చాల బీదవాడు. అందునా పరపతిగల అధిపతుల ముఖ్యా-మొహం (కాళ్ళు చేతులూ ఇత్యాదులు) కూడా తెలియనివాడు.

సరే! మాధవరావు చాల తెలివైన వాడని కదా చెప్పుకొన్నాం. అతన్ని క్లాసులో విద్యార్థులు అడిగిన ప్రశ్నలలో ఏవి నిజంగా సందేహనివృత్తి గురించి అడిగినవో, ఏవి తనని ఏడిపించడానికి ఉద్దేశించినవో ఇట్టే సూక్ష్మంగా పరిశీలించి, ఎవరికి 'అర్ధమయ్యే' పరిభాషలో వాళ్ళకి ఆవిధంగా సమాధాన మివ్వడంలో దిట్ట. మొత్తమ్మీద అతనంటే చాలాబాగా చెప్తాడని విద్యార్థు లందరికీ భక్తి, గౌరవము. స్టాఫు అందటికీ అతను చాలా 'స్నేహపాత్రుడు' మరి, అలాటివాడికి ఒక నాడు ఏం జరిగిందంటే.........

* * *

'సీతా! నేనలా వెళ్ళొస్తాను. ఏవైనా కావలిస్తే చెప్పు. తీసుకొస్తాను' అన్నాడు మాధవరావు బయటికి వెళ్ళబోతూ భార్య నుద్దేశించి.

"ఏవీ అక్కరలేదు. కాని ఏవో రెండు కూరలు తెచ్చి పడెయ్యండి చాలు" అందామె వంటింట్లోంచే.

సరే, మాధవరావు మార్కెట్టుకు బయలుదేరాడు. దూరాన్నుంచే మార్కెట్టులో నుంచి పొగలూ, గ్రట్రా రావడం చూశాడు. దగ్గరకెళ్ళి చూస్తే ఏముంది? మార్కెట్టులో కూరల ధరలన్నీ మండిపోతున్నాయి. ఈ మంటల నార్పడానికి ఫైరు సర్వీసు వాళ్ళకి సాధ్యంకాదు కదా! మార్కెట్టంతా చాల రద్దీగా ఉంది. ఎక్కడ చూసినా అరుపులూ, కేకలూ (ముఖ్యంగా అమ్మే వాళ్ళవే ఇవి) సరే, మాధవరావు అలా చూసుకొంటూ వెళ్తూ ఒకచోట కూరగాయలు బావున్నట్టుగా తోచి అక్కడ కెళ్ళాడు కొందామని. చాలమంది జనం అక్కడే కొంటున్నారు. మాధవరావు అరవీశ వంకాయలు, పావువీశ బీరకాయలూ కొని అయిదు రూపాయల నోటు అందించాడామెకు. ఆ మనిషి ఎవరికో తూస్తున్న సందడిలో ఆ నోటు తీసుకొని అడుగున పెట్టింది. మాధవరావు ఒకటి రెండు నిముషాలు అలా నించున్నాడు చిల్లర గురించి. ఆమె పని అయేవరకూ.

---

రెండవ బహుమతి రూ. 25

కొడవంటి సత్యనారాయణ
(సెకండియర్, గవర్నమెంట్ పాలిటెక్నిక్, విశాఖపట్టణం_7.)

ఆమె చిల్లర ఇవ్వలేదు. పైగా తన పని అయిపోయేక అతనివేపు తిరిగి,

"బాబుగోరూ, తవురు డబ్బు ఇవ్వ లేదు ఇంకా।" అంది.

మాధవరావు ఇదివిని తెల్లబోయాడు. తను డబ్బు ఇస్తుండగా చూసినవాళ్ళు యెవరూలేర్రు. అందఱూ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగి ఉన్నారాయె.

అతను తను అయిదు రూపాయల నోటు ఇచ్చానని చెప్పాడు.

"బాబుగారు, తవురు అబద్ధ మాడు తున్నారని అనుకానీ, తవురు ఏమీ నాకు ఇవ్వలేదు బాబూ. నాదగ్గర అసలు ఒక్క అయిదురూపాయల నోటైనా లేదు. కావలిస్తే చూసుకోండి ఇదిగో" అంటూ ఆమె అడుగునున్న డబ్బు ల పెట్టితీసి చూపించింది.

నిజం ! అందులో అయిదురూపాయలనోటు ఒక్కటికూడా లేదు. అక్కడున్న అందరూ మాధవరావు వేపు వింతగా, ఆశ్చర్యంగా, అనుమానంగా చూశారు. మాధవరావు కొంత షేమ్ ఫీలయ్యాడు. అయినా, స్వతహాగా తెలివైన వాడు కదూ ! కొంతసేపు ఆలోచించగా మెదడులో ఒక ఆ లో చ న మెరపులా తట్టింది. తట్టిన వెంటనే

"అమ్మి ! నిజంగా నే నిచ్చాను. నే నిచ్చిన దానికి ఏదో పసుపు మచ్చ కూడా ఉన్నట్లు అనుమానం. క్రింద నేలమీద యెక్కడైనా పడిపోయిందేమో చూడు" అని అన్నాడు.

వెంటనే ఆమె నేలమీదకు వంగి అటూ ఇటూ వెతికి కొంతసేపయాక ఒక అయిదు రూపాయల నోటు పైకి తీసింది. తీసి,

"నన్ను చమించండి బాబూ ? చూచుకోనేదు. ఇదిగో తమరిచ్చిన నోటు. ఇదిగో, దీని కిక్కడ పసుపు కూడా అంటుకొన్నాది బాబూ" అంటూ చెప్పింది.

మాధవరావు ఒక్కక్షణం నిశ్చేష్టుడై అలా ఉండిపోయాడు యెందుకో మరి. ఇంతట్లోకే ఆమె

"బాబూ, ఈ నోటు సెల్లదుబాబూ । పసుపు మరకలు బాగా అం టు కొన్నాయి. దయసేసి మరోటి ఇప్పించండి" అంది.

అక్కడున్న అందరూ నోటు ఉన్నట్లు చూసుకోకుండా మాట్లాడినందుకు ముందు ఆమెను తిట్టి, తరువాత ఆ నోటు చెల్లదని చెప్పి మాధవరావుని మరోటి ఇమ్మన్నారు ఆమెకు. మాధవరావు ఆనోటు తీసికొని మరోటిచ్చాడు యాంత్రికంగా.

* * *

సరే. మాధవరావు తెలివిగా తన నోటు సంపాయించే డనుకొంటున్నారు కదూ. కాని అలా జరిగినట్టయితే అసలు కథేముంది ? అసలు నిజంగా మాధవరావు ఇచ్చిన నోటు మంచిదే ! కాని తను పసుపు మచ్చలు ఉన్నట్లు అనుమానం వెలిబుచ్చితేనైనా ఆమె నోటు చెల్లదేమోనని భయపడి పైకి తీసుందని చాల తెలివిగా ఆలోచించి పథకం వేశాడు, కాని, ఆ కూరలమ్మి ఇతని కన్నా చాల తెలివైనది. అందుకని ఇంతకుముందే తన దగ్గరున్న ఒక చెల్లని అయిదు రూపాయల నోటుని ఇతనిదంటూ అంటకట్టింది. అంత తెలివైన యూనివర్శిటీ ఫస్టు మాధవరావు కూడా కూరలమ్మిదగ్గర బోల్తాకొట్టాడు.

***